# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 16 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఏసీబీ వలలో బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

,హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఓ బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. జోన్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్ ఫిర్యాదు దారుడి నుంచి రూ.2,20,000 లంచం డిమాండ్ చేయగా.. రూ.70,000 తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద లంచం డిమాండ్ చేశాడు. మొక్కల పదార్థాల సరఫరాకు చెక్ మెజర్డ్ బిల్లులను క్లియర్ చేసేందుకు శ్రీనివాస్ లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

## మహిళా సాధికారతే ప్రభుత లక్ష్యం




- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు, హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీయే పునాదులేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో జరిగిన స్త్రీ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. దేశంలో బాల్యవివాహాలు, వరకట్న నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, ఆస్తిలో వాటా వంటి చట్టాలు హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకొచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33శాతం మంది మహిళలకు రిజర్వేషన్లను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఆ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రానున్న ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. మొదటి ఏడాదే లక్ష్యానికి మించి రూ. 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామ న్నారు. రాబోయే నాలుగేండ్లలో ప్రతి ఏటా రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు అంద జేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో వారికి భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకొస్తున్నట్టు వివరించారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వం లోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే వారితో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలను ప్రభుత్వమే లీజుకిచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ సౌకర్యం ద్వారా మహిళలు హాస్టళ్ళలోని తమ పిల్లలను చూసేందుకు, మార్కెట్లు, దేవాలయాలను స్వేచ్ఛగా సందర్శిం చేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకిచ్చి ఆర్థిక ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆధునిక యుగంలోనూ నేటికీ బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయనీ, ఈ అంశంపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. స్త్రీ సమ్మిట్ వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి, ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# పార్టీ లైన్ దాటితే ఊరుకోం

- నేటి నుంచి ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి..
- వచ్చే నెల నుంచి ప్రజలను నేరుగా కలుస్తా
- మంత్రివర్గ విస్తరణపై అధిష్టానానిదే తుది నిర్ణయం
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కొంత మంది ఎమ్మెల్యేలు మంత్రివర్గ విస్తరణపై బహిరంగంగా విమర్శలు చేయడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. పార్టీ లైన్ దాటితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. సీఎల్పీ సమావేశంలో ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్16 నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో పర్యటించేలా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. గతంలో రూ.2లకే కిలో బియ్యంతో పాటు ఇప్పుడు సన్నబియ్యం పంపిణీ ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఇక 'భూభారతి' పోర్టల్‌ను రైతులకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ క్లాస్ తీసుకున్నారు. ఎవరికి వాళ్లు ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎవరు ఏం మాట్లాడినా అంతా రికార్డవుతుందన్నారు. కొందరు ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారన్నారు. మంత్రి పదవులు అంశం అధిష్ఠానం చూసుకుంటుందన్నారు.

సంక్షేమపథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ ఎమ్మెల్యేలకు సూచించారు. తెలంగాణ పథకాలతో మోదీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని.. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందన్నారు. కంచ గచ్చిబౌలి భూములపై ఏఐతో అబద్ధపు ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తున్నాయని సీఎం అన్నారు.

ఇకపై రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పావులు కదుపుదాం...అందుకు తగినట్లుగా భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేద్దా అని సీఎం రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. త్వరలోనే ఎమ్మెల్యేలకు వ్యక్తిగతంగా అపాయింట్‌మెంట్ ఇస్తానని చెప్పుకొచ్చారు. రెండోసారి గెలవడానికి మీ నియోజకవర్గాల్లో ప్రభావితం చేసే పనులను తీసుకురండి.. దగ్గరుండి నేనే చేయిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని తెలిపారు. ఇందుకోసం కేంద్ర మంత్రులతోపాటు ప్రస్తుతం ప్రధాని మోడీ కూడా రంగంలోకి దిగారని ఎద్దేవా చేశారు.

**నోవాటెల్‌లో సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం**

సీఎం రేవంత్ రెడ్డి నోవాటెల్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సీఎల్పీ సమావేశానికి వెళ్తున్న క్రమంలో హోటల్ లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. సీఎం అందులోనే ఉండటంతో అందరూ టెన్షన్ పడ్డారు. లిఫ్ట్ ఆగాల్సిన చోటుకంటే రెండు అడుగులు కిందకు దిగింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో సమస్య వచ్చినట్లు హోటల్ సిబ్బంది తెలిపారు. లిఫ్ట్ డోర్లు వేయకముందే 2 అడుగుల మేర కిందకు జారడంతో వెంటనే సీఎం సెక్యూరిటీ, హోటల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎంను సెకండ్ ఫ్లోర్‌కు పంపారు. తరువాత వేరే లిఫ్ట్‌లో ముఖ్యమంత్రిని తరలించారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## కొత్త టోల్‌తో ఇబ్బందులన్నీ తొలగిపోతాయి



- త్వరలోనే దేశవ్యాప్తంగా టోల్ బూత్‌లను తొలగిస్తాం
- 15 రోజుల్లో కొత్త టోల్ పాలసీ
- కొత్త టోల్ విధానంలో శాటిలైట్ ట్రాకింగ్, వెహికిల్ నంబర్ ప్లేట్ గుర్తింపు తదితర సాంకేతిక
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కొత్త టోల్ పాలసీ విధానంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త టోల్‌తో ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టబోతున్న టోల్ విధానంలో శాటిలైట్ ట్రాకింగ్, వెహికిల్ నంబర్ ప్లేట్ గుర్తింపు తదితర సాంకేతికను సైతం ఉపయోగించనున్నట్లు ప్రకటించారు. దాంతో నేరుగా బ్యాంకు ఖాతా నుంచి టోల్ మొత్తం డెబిట్ అవుతుందని.. ఇక మాన్యువల్‌గా టోల్ వసూలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ముంబయి దాదర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.త్వరలోనే దేశవ్యాప్తంగా టోల్ బూత్‌లను తొలగిస్తామని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త టోల్ విధానంపై పనిచేస్తోందని, ఇది త్వరలో అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం వివరాలన్నీ ఇప్పుడే చెప్పలేనని.. మరో 15 రోజుల్లో కొత్త టోల్ పాలసీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత టోల్ సిస్టమ్‌పై ఫిర్యాదులు ఉండవచ్చన్నారు. ముంబయి–గోవా హైవే నిర్మాణ పనులు జూన్ వరకు పూర్తవుతాయన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్న హైవే ఇదని.. పనులు పూర్తయితే ప్రజలకు, కొంకణ్ వైపు వెళ్లేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. దేశ మౌలిక సదుపాయాల మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో భారత రోడ్లు మెరుగ్గా మారుతాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో హైవేలు, రోడ్‌నెట్‌వర్క్ మెరుగవడం చాలా కీలకమని.. ఈ దిశగా ప్రభుత్వం వేగంగా పని చేస్తుందన్నారు. ముంబయి–గోవా మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి ఈ రెండు ప్రదేశాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. కొంకణ్ ప్రాంతంలో అభివృద్ధి వేగానికి కొత్త ఊపునిస్తుందని.. చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయన్నారు.

జూన్ నాటికి రోడ్డు నిర్మాణ పనులు వందశాతం పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, కోర్టు కేసులు, పరిహారం సంబంధిత సమస్యలపై వివాదాల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రస్తుతం, వివాదాలన్నీ పరిష్కారమయ్యాయని.. పనులు ఊపందుకున్నాయన్నారు. దేశ మౌలిక సదుపాయాలలో ఉన్న సవాళ్లపై స్పందిస్తూ.. ఢిల్లీ–జైపూర్, ముంబయి–గోవా వంటి హైవేలు ఇప్పటికీ రోడ్లు రహదారులశాఖకు 'బ్లాక్ స్పాట్స్'గా పేర్కొన్నారు. నిజాలు చెబితే ప్రజలు నమ్మకపోవచ్చునని వ్యాఖ్యానించారు.

## 38 మంది జిల్లా జడ్జీల బదిలీలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా 38మంది జిల్లా, సెషన్స్ జడ్జీలను బదిలీ చేస్తూ మంగళవారం హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి. విధుల్లో ఉన్న జడ్జిలు బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించి రిలీవ్ కావాలని పేర్కొన్నారు. 23లోగా కొత్త పోస్టుల్లో బాధ్యతలను చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే వాదనలు పూర్తిచేసి రిజర్వు చేసిన కేసుల్లో తీర్పు వెలువరించేందుకు అనుమతించారు.

## వడదెబ్బ మరణాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా

**ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. దీంతో వడగాలుల సమస్యపై కార్యాచరణ ప్రణాళికను జారీ చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో పాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు, వడదెబ్బ వంటి కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ(డిజాస్టర్ మెనేజ్‌మెంట్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వడగాలులను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నిర్దేశించిన మేరకు గుర్తిస్తారు. వడదెబ్బ మరణాలను గుర్తించేందుకు జిల్లాల్లో డీఎంహెచ్ఓ, సంబంధిత మెడికల్ ఆఫీసర్, ఎంఆర్ఓ, పోలీస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ వరకు చేయాల్సిన విధులను నిర్దేశించింది. మరణించిన వ్యక్తి అప్పటికే రైతు బీమా స్కీం కింద నమోదై ఉంటే బీమా, ఎక్స్‌గ్రేషియా రెండింటిలో ఒక దానికే అర్హత ఉంటుంది. అయితే రెండింటిలో ఎక్కువ మొత్తం వచ్చే దానిని మరణించిన వ్యక్తి కుటుంబానికి అందజేస్తారు.

## లాసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైందని తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు ఈనెల 15వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించామని వివరించారు. జూన్ ఆరో తేదీన లాసెట్ రాతపరీక్షలుంటాయని తెలిపారు.

## రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది


- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలోనే వరి ఉత్పత్తిలో ఈ ఏడాది తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సుమారుగా 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని వెల్లడించారు. రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'బియ్యం ఎగుమతి విధానం' అనే అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి మంత్రి హాజరై మాట్లాడారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను, కేంద్ర నిల్వల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని అన్నారు. మిగులు ధాన్యం మార్కెట్ చేయడంలో భాగంగా ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావకాశంగా తీసుకొని, ఆ ప్రభుత్వంతో నేరుగా అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని వివరించారు. దొడ్డు రకాల్లో ముఖ్యమైన మీఖ–1010, ఐఆర్–64ను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి నేరుగా విత్తే పద్ధతి, రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం, తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతిదారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యూనివర్సిటీ వీసీ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్‌గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే ఇక్కడ పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్టేనని చెప్పారు. అంతేకాకుండా, ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతి దారులకు సరఫరా చేసినట్టయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని మంత్రికి సూచించారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామో దర్ రాజు, వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మహంతి.. ఎగుమతుల విధానంపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సోనియా, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జ్‌షీట్




- నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చిన ఈడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'నేషనల్ హెరాల్డ్' పత్రిక కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మనీలాండరింగ్ అభియోగాలను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏప్రిల్ 9న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులోని ప్రత్యేక జడ్జి జస్టిస్ విశాల్ గోగ్నేకు ఛార్జ్‌షీట్‌ను ఈడీ అధికారులు సమర్పించారు. ఇందులో నిందితులుగా కాంగ్రెస్ నేతలు సామ్ పిట్రోడా, సుమన్ దూబేల పేర్లను కూడా చేర్చారు. తాజాగా ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిశీలించిన ప్రత్యేక జడ్జి జస్టిస్ విశాల్ గోగ్నే, దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 25వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజున కేస్ డైరీలను కూడా తమకు పరిశీలన నిమిత్తం సమర్పించాలని ఈడీ ప్రత్యేక న్యాయవాది, విచారణ అధికారికి జడ్జి ఆదేశాలు జారీ చేశారు.

ఈ ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక జడ్జి జస్టిస్ విశాల్ గోగ్నే పరిశీలించే క్రమంలో, ఈడీ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.కె.మత్తా వాదన వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 3 (మనీలాండరింగ్), సెక్షన్ 4 (మనీలాండరింగ్ చేసినందుకు శిక్ష) ప్రకారం ఈ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశామని తెలిపారు. దీనికి ప్రత్యేక జడ్జి స్పందిస్తూ, "ఈ ఫిర్యాదును తనిఖీ చేసి, విచారణ కోసం రిజిస్టర్ చేయించడానికి మాకు సమయం కావాలి. మొత్తం ఫైల్/డాక్యుమెంట్లను కోర్టు సిబ్బంది సక్రమంగా సిద్ధం చేస్తారు. తదుపరి విచారణ తేదీ (ఏప్రిల్ 25) కల్లా ఛార్జ్‌షీట్‌కు సంబంధించిన సాఫ్ట్ కాపీని మాకు అందించండి. చదవదగిన విధంగా దాన్ని తయారు చేయించండి" అని ఆదేశించారు.

## ప్రభుత్వాన్ని పడగొట్టమంటున్నారు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనతో ప్రజలు, పారిశ్రామిక వేత్తలు విసుగు చెందారని అన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆయా వర్గాలుకోరుతున్నా యని చెప్పారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసైనా సరే.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని ఒత్తిళ్లు వస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు సొమ్ములు కురిపించేందుకు.. పారిశ్రామిక వేత్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈనేపథ్యంలో తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. బీఆర్ ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చి.. ముఖ్యమంత్రి సీటులో కూర్చోవాలని తండ్రీ కొడుకులు మురిసిపోతున్నారని.. అందుకే తమ కీలక నాయకుడు కొత్త ప్రభాకర్‌రెడ్డితో ఇలాంటి వ్యాఖ్యలు చేయించారని పొంగులేటి వ్యాఖ్యానించారు. అయితే.. తమది ప్రజాప్రభుత్వమని.. ఎవరూ తమను గద్దె దింపలేరని ఆయన చెప్పారు. ప్రజా రంజక పాలనను చూసి ఓర్వలేక.. ఇలా చేస్తున్నారని అన్నారు. తమప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా సంపాయించిన సొమ్మును లాగేసుకుంటుందన్న భయంతోనే ఇలా వ్యాఖ్యానించారని దుయ్యబట్టారు.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లోపని నానక్‌రాంగూడలో సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఐటీశాఖ మంత్రి ప్రారంభించారు.

హైదరాబాద్‌లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల "గ్రేడ్– ఏ" కమర్షియల్ స్పేస్‌ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియయంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలుండగా 3 లక్షల మందికి ఉద్యోగాలు

మిగితా 2వ పేజీలో

# రైతన్న గోస ఇప్పటికైనా పట్టించుకోండి



**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోస్తున్న కాంగ్రెస్ సర్కారు దుర్మార్గ వైఖరిని యావత్ తెలంగాణ గమనిస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే , మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన రైతు దంపతులు బొల్లం రామయ్య, చంద్రకళ ఆవేదన చూస్తే కడుపు తరుక్కుపోతోందని ఎక్స్ వేదికగా ట్విట్ చేశారు. అకాల వర్షాలు, సాగు నీటి గోస, కరెంట్ కష్టాలను ఎదుర్కొని కౌలుకు తీసుకున్న 18 ఎకరాల్లో వరి సాగు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వ రూపంలో విపత్తు రైతన్నను నట్టేట ముంచింది. కొండంత సంబురంతో పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి 20 రోజులు గడిచినా ప్రభుత్వం పంట కొనుగోలు చేయలేదు. దీంతో అకాల వర్షం ఆ రైతన్నను నిండా ముంచింది. కష్టపడి పండించిన ధాన్యమంతా తడిసి ముద్దయింది. ప్రభుత్వం ధాన్యం కొనకపోగా, పరిహారం కూడా చెల్లించకపోవడంతో తడిసిన ధాన్యం రాశి ముందు రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని చెప్పడానికి ఈ రైతుల కన్నీటి దృశ్యమే ప్రత్యక్ష సాక్ష్యం. రైతుల జీవితాల్లో కాలం తెచ్చిన విపత్తు కాదు, కాంగ్రెస్ తెచ్చిన విపత్తు ఇది. నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారని, కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారని, కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా నేడు అకాల వర్షాలపాలు చేసి ఆగం చేస్తున్నారు. మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ పాలకులారా రైతన్న గోస ఇకనైనా పట్టించుకోవాలి. ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం బాగుపడదని గుర్తుకు పెట్టుకోవాలి. మీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం..అని హరీష్ రావు ట్వీట్ చేశారు.

# తమిళనాడు స్వయంప్రతిపత్తికి కమిటీ..

**బలగం టీవి, హైదరాబాద్**

బిల్లుల ఆమోదంపై గవర్నంఆర్.ఎన్. రవి , తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ విభేదాల వేళ.. ఎంకే స్టాలిన్ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయంప్రతిపత్తిపై సూచనలకు ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫారసు చేయనుంది. ఈ మేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధరిస్తుంది. సిఫార్సులతో కూడిన తుది నివేదికను ఈ కమిటీ రెండేళ్లలో ప్రభుత్వానికి సమర్పించనుంది.

తమిళనాడు ప్రభుత్వం పంపిన పలు బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించలేదు. అలాగే అసెంబ్లీ తిరిగి ఆమోదించిన ఈ బిల్లులను తప్పుగా రాష్ట్రపతికి పంపడం న్యాయపరమైన సవాలుకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అసెంబ్లీ తిరిగి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపిన గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను ఉల్లంఘించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో తిరిగి ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదం పొందినట్లుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.



సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వం తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టాలు (రెండవ సవరణ) 2022, తమిళనాడు ఫిషరీస్ యూనివర్శిటీ (సవరణ) చట్టం 2020 (గతంలో తమిళనాడు డాక్టర్ జే జయలలిత ఫిషరీస్ యూనివర్శిటీగా ఉన్న పేరు మార్పు), ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే యూనివర్శిటీల్లో వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారాన్ని గవర్నర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు వంటి చట్టాలను గవర్నర్, రాష్ట్రపతి అనుమతి లేకుండానే ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫై చేసింది. ఏప్రిల్ 11న ఆ రాష్ట్ర గెజిట్‌లో పది చట్టాలను అధికారికంగా నోటిఫై చేసింది. ఒక రాష్ట్రం ఇలా చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.

# అలహాబాద్ హైకోర్టు తీర్పులపై సుప్రీంకోర్టు అభ్యంతరం

**బలగం టీవి, హైదరాబాద్**



అలహాబాద్ హైకోర్టు తీర్పులపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఆ కోర్టులో ఏం జరుగుతోందని ప్రశ్నించింది. ఆ హైకోర్టు నుంచి ఇటీవల వెలుబడిన కొన్ని తీర్పులను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తన సమస్యను తానే కొని తెచ్చుకున్నట్లు ఇటీవల ఓ కేసు తీర్పు సమయంలో లైంగికదాడి బాధితురాలని అలహాబాద్ హైకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మహిళలపై లైంగిక దాడి జరుగుతున్న కేసుల్లో.. తీర్పులు ఇస్తున్న జడ్జీలు అనుచిత వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు తెలిపింది.

జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాషిలతో కూడిన ధర్మాసనం.. ఇటీవల అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా తప్పుపట్టింది. కేసు విషయంలో బెయిల్ ఇచ్చే అధికారం పూర్తిగా జడ్జి ఆధీనంలోనే ఉంటుందని, ఆ కేసుకు చెందిన సాక్ష్యాల ఆధారంగా బెయిల్ ఇవ్వవచ్చు అని, కానీ బాధితులపై అనవసరమైన వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు చెప్పింది. వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు జడ్జీలు చాలా జాగ్రత్తగా ఉండాలని జస్టిస్ గవాయి తెలిపారు. వీ ద వుమెన్ ఆఫ్ ఇండియా సంస్థ దాఖలు చేసిన సుమోటో కేసుపై విచారణ చేపడుతూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చేతులతో మైనర్‌ను వేధించడం, పైజామా విప్పడం లాంటి చర్యలు అత్యాచారం యత్నం కిందకు రావు అని ఓ కేసులో హైకోర్టు ధర్మాసనం చెప్పడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

# అమెరికాకు చైనా షాక్

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికా–చైనాల మధ్య టారిఫ్ వార్ రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే చైనా పలు కీలక ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని నిలిపివేసింది. ఆ దేశ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయడం మానేసింది. తాజాగా అమెరికాలోని విమానాల తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన విమానాల్ని కొనుగోలు చేయొద్దని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దేశ విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. బ్లూమ్‌బర్గ్ సైతం ఇదే విషయాన్ని ధృవీకరించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా , చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. ఇప్పటికే అమెరికా, చైనా నుంచి దిగుమతులపై 145 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. దీనికి ప్రతిగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం కస్టమ్స్ టారిఫ్‌లు విధించింది. ఈ తరుణంలో చైనా, దేశీయ విమానయాన సంస్థలు బోయింగ్ విమానాలను కొనుగోలు చేయకుండా ఆదేశించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. అంతేకాకుండా, అమెరికా నుండి విమాన భాగాలు,ఉపకరణాల కొనుగోళ్లను కూడా నిలిపివేయాలని పేర్కొంది. అదే సమయంలో విమానాల లీజు తీసుకునే సంస్థలకు చైనా ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బోయింగ్ సంస్థ నుంచి అత్యధిక విమానాలు కొనుగోలు చేసేది చైనానే.. ఇప్పటికే నష్టాలతో ఉన్న బోయింగ్ కంపెనీకి చైనా నిర్ణయంలో మరిన్ని నష్టాలు వస్తాయని అంటున్నారు.

# నేడు జపాన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బృందం

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి కే.రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధికారుల బృందం జపాన్ పర్యటనకు సిద్ధమయ్యారు. ఈ పర్యటన 2025 ఏప్రిల్ 16 నుంచి 22 వరకు కొనసాగనుంది. జపాన్‌లో ముఖ్యంగా టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమా నగరాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటన తెలంగాణకు పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారాన్ని పెంచేందుకు ఎంతో కీలకమైనవని చెప్పవచ్చు.

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయన్నారు. హైదరాబాద్ ను జీసీసీలకు హబ్‌గా మార్చడమే కాకుండా వాటిని ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్?బాబు మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమ జీసీసీని హైదరాబాద్ లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వేయి మంది ఐటీ, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.

# 'కస్తూర్బా'లో విద్యార్థినుల ఆందోళన

**బలగం టీవి, హైదరాబాద్**

తమను నిత్యం వేధిస్తున్న ఇంగ్లీష్ టీచర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ గురుకులం విద్యార్థినులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పది రోజుల కిందట ఇంగ్లీష్ టీచర్ కళ్యాణి వేధింపులు భరించలేక తొమ్మిదో తరగతి విద్యార్థిని చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఇప్పటి వరకు సదరు టీచర్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థినులు ఆందోళనకు దిగారు. కొద్దిగా ఆలస్యమైనా టీచర్ వేధిస్తున్నారని, చదవడం లేదని గొంతు పట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను సస్పెండ్ చేసే వరకు తరగతి గదికి వెళ్లబోమని మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా విద్యార్థులు ఎండలోనే సుమారు మూడు గంటల పాటు బైటాయించారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థి, రాజకీయ పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఇంగ్లీష్ టీచర్ కళ్యాణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకులు కందికొండ గీత డిమాండ్ చేశారు. ఆమెను సస్పెండ్ చేసే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆలస్యంగా వస్తే మూడు గంటలపాటు తాగునీరు ఇవ్వకుండా, కనీసం టాయిలెట్స్‌కు పోనివ్వకుండా హింసించడం సరికాదన్నారు. వేధింపులు భరించలేక ఓ విద్యార్థిని బ్లేడ్‌తో చెయ్యి కోసుకోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఫోన్ ద్వారా డీఈ వోని సంప్రదిం చగా.. తాను షోకాజ్ నోటీసులు పంపించాను.. సస్పెండ్ చేసే అధికారం తన వద్ద లేదని, కలెక్టర్ పరిధిలో ఉందని తెలిపారు.




# లబ్ధిదారులకు లక్ష రూపాయలు చెక్కులు అందజేసిన సీఎం

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద బేస్‌మెంట్ వరకు ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్దిదారులకు మొదటి విడతగా లక్ష రూపాయలు చెల్లించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు లాంఛనంగా ప్రారంభించారు. వికారాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, సూర్యాపేట, మహబూబ్ నగర్, సిద్దిపేట జిల్లాలకు చెందిన పలువురు లబ్దిదారులకు లక్ష రూపాయల విలువైన చెక్కులను ముఖ్యమంత్రి గారు అందజేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు. 2019 మంది బేస్‌మెంట్ వరకు ఇండ్లను పూర్తి చేసుకోగా వారికి 20.19 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని మంత్రి పొంగులేటి గారు చెప్పారు

# అవసరమైన రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలి

**-రహదారులకు ఇరువైపులా పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలి.**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు,స్పీడ్ కంట్రోల్ సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు.జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో రబ్బర్ స్ట్రిప్స్ , స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. రోడ్లపై వ్యా అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు..

ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని అన్నారు.అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ %శ% రోడ్, గంభీరావుపేట, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ అండ్ బీ. ఈ.ఈ. వెంకట రమణయ్య , జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ , మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య, పి.అర్.ఈఈ సుదర్శన్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,ఆర్.టి.సి. అధికారులు, నేషనల్ హైవేస్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ కమిటీ మెంబర్ సంగీతం శ్రీనాథ్, అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిపాదించిన 240 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 119 ఐకేపి, 21 పాక్స్, 7 మెప్మా, 1 డి .సి.ఎం.ఎస్. మొత్తం 148 కేంద్రాలను ఓపెన్ చేశామని, మరో రెండు రోజుల వ్యవధిలో మిగిలిన 92 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకుని వచ్చే ధాన్యం తేమ శాతం , ఇతర ప్రమాణాలను చెక్ చేసి ఎఫ్.ఏ.క్యు ఉన్న ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసీ ఓ.పి.ఎం.ఎస్.లో ఎంట్రీ చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రక్ షీట్స్ ప్రకారం సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడైనా రైస్ మిల్లర్లు ధాన్యం దించుకొని పక్షంలో ఇంటర్మీడియట్ గోదాము లకు తరలించాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఖాళీ గోదాము లను సమీపంలో గల కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేయాలనిఅన్నారు.ప్రతి మండలం సమీపంలో గల గోదాములను ధాన్యం భద్ర పరిచేందుకు హైర్ పద్ధతిలో తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలి..




**- పోలీస్ అధికారులు ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి..**

**- ఎస్పీ మహేష్ బి గితే**

**బలగం టీవీ,సిరిసిల్ల**

రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలని, గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. మంగళవారం ముస్తాబాద్, గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నర్మల ఎగువ మానేరును సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని,పోలీస్ అధికారులు, సిబ్బంది స్టేషన్ పరిధిలోని గ్రామాలు,వార్డులు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని అన్నారు. డయల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది, అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని,పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలోని చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేస్తూ గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతూ, గంజాయి వలన కలుగు అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమం లో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు శ్రీనివాస్,మొగిలి, ఎస్ఐ ప్రేమనందం,సిబ్బంది ఉన్నారు.

## సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్‌గా వంతడుపుల గణేష్..



**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ సాంస్కృతిక సారథి రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన జిల్లా కోఆర్డినేటర్ టీమ్ లీడర్ల ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్ గా వంతడుపుల గణేష్, గౌరవ సలహాదారులుగా శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య,సిరిసిల్ల నియోజకవర్గ టీం లీడర్ గా గడ్డం శ్రీనివాస్,వేములవాడ నియోజకవర్గ టీం లీడర్ పొత్తూరి రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిని మర్యాద పూర్వకంగా కలిశారు.

# నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ..

**-ఏప్రిల్ 17 లోగా గ్రామాలకు / వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల అలాట్మెంట్ పూర్తి చేయాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, మనకు వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని, మన జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 7000 ఇండ్లు మొదటి విడతలో నిర్మిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పై పలు సూచనలు చేశారనిఅన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు.

ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు ఏప్రిల్ 17 లోగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని అన్నారు. ఏప్రిల్ 21 లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి ప్రతి గ్రామానికి/ వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల కు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని, గ్రామాలలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే సంబంధిత ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని ఎంపీడీఓ లకు సూచించారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడి ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 30 వరకు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని, ఎవరైనా అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. మే 2,2025 న ప్రతి గ్రామంలో అర్హుల జాబితా అతికిస్తామని, జిల్లా ఇంఛార్జి మంత్రి వర్యుల తుది ఆమోదంతో మే 5 తరువాత ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలు పంపిణీ మండల కేంద్రాలకు అందించడం జరుగుతుందని అన్నారు. మండలాల వారిగా స్థానిక ప్రజాప్రతినిధుల సమయం తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీకి ఏర్పాటు చేసుకోవాలని, ఇందిరమ్మ కమిటీ లో నుంచి జాబితా తెచ్చుకునే అంశంలో అధికారులు, ఆర్డిఓ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు నాలుగు దశలలో సహాయం అందుతుందని, బేస్మెంట్ పూర్తయితే 1లక్ష రూపాయలు, లెంటల్ లెవెల్ పూర్తయితే 1లక్ష , స్లాబ్ నిర్మాణం జరిగినప్పుడు 2 లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత 1 లక్ష చొప్పున మొత్తం 5 లక్షల రూపాయల ప్రభుత్వం నుంచి విడుదల చేయడం జరుగుతుందని అన్నారు .

మన జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో 1023 ఇండ్లు మంజూరు చేశామని, వీటిలో 282 ఇండ్లు మాత్రమే ఇప్పటివరకు మార్క్ చేయడం జరిగిందని, పెండింగ్ లబ్దిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చూడాలని, ముందస్తుగా నిధులు ఇబ్బందులు ఉన్నవారికి స్వశక్తి మహిళా సంఘాల ద్వారా రుణం అందించి పనులు ప్రారంభించాలని అన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధా భాయి, పిడి. హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి , జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న ఆలయ అభివృద్ధికి గ్రంథాలయ చైర్మన్ విరాళం

**బలగం టీవీ, సిరిసిల్ల:**



గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కి జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ రూ.51,000/ వేల విరాళం అందజేశారు. గత వారం రోజుల క్రితం శ్రీ రామ నవమి సందర్భంగా భీముని మల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయ స్వామి చారిత్రాత్మక దేవాలయం ను మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు రాచర్ల వెంకన్న, సుధాకర్ శర్మ ల తో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ దర్శించుకొని, వ్యక్తిగతంగా రూ.51,000/ వేల విరాళం అందజేస్తానని హామీ ఇచ్చి,అట్టి డబ్బులను గ్రామపెద్దలకు, దేవాలయ కమిటీకి ఇవ్వమని వెంకన్నకు అందజేశారు. అట్టి డబ్బులను సిరిసిల్ల లో వెంకన్న కమిటి కి అందజేశారు.గుడి అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చే, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, విప్ ఆది శ్రీనివాస్ లచే మాట్లాడి, అంచనా వేయించి అభివృద్ధి చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ హామీ ఇచ్చారని వెంకన్న తెలిపారు.ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్య నారాయణ కి సుధాకర్ శర్మ , రాచర్ల వెంకన్న కి గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షులు మణిదీప్, ఎల్లారెడ్డి, కేశవచారి, మెతుకు బాబు, కముటము వెంకట స్వామి, పర్శరాములు, దేవాలయ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపినారు.

# లో స్కోర్ థ్రిల్లర్‌లో పంజాబ్ విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్-2025లో ముల్లాన్‌పూర్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన లో స్కోర్ థ్రిల్లర్ మ్యాచ్‌లో 16 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ సంచలన విజయం సాధించింది. 112 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేధించడంలో కేకేఆర్ చతకలపడింది. పంజాబ్ బౌలర్ల దాటికి 15. 1 ఓవర్లలో కేవలం 95 పరుగులకే కుప్పకూలింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. ప్రియాంశ్ ఆర్య(12 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(15 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో హర్షిత్ రాణా(3/25) మూడు వికెట్లు తీయగా.. సునీల్ నరైన్2/14), వరుణ్ చక్రవర్తి(2/21) రెండేసి వికెట్లు పడగొట్టారు. వైభవ్ అరోరా, అన్రిచ్ నోర్జ్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ(28 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 37), ఆండ్రీ రస్సెల్(11 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 17 ) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పంజాబ్ బౌలర్లలో చాహల్ (4/28) నాలుగు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్(3/17)మూడు వికెట్లు పడగొట్టాడు. గ్జెవియర్ బార్ట్‌లెట్, గ్లేన్ మ్యాక్స్‌వెల్ తలో వికెట్ తీసారు.

యుజ్వేంద్ర చాహల్ సంచలన బౌలింగ్‌తో మ్యాచ్‌ను పంజాబ్ వైపు మలుపు తిప్పాడు. నిలకడగా ఆడుతున్న అజింక్యా రహానే(17)ను ఔట్ చేసి 55 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీసిన చాహల్.. దూకుడుగా ఆడిన రఘువంశీని కూడా పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత ఒకే ఓవర్‌లో వరుస బంతుల్లో డేంజరస్ ప్లేయర్ రింకూ సింగ్(2)తో పాటు రమణ్‌దీప్ సింగ్(0)లను ఔట్ చేసి కేకేఆర్ పతనాన్ని శాసించాడు. చివర్లో భారీ షాట్లు ఆడిన రస్సెల్‌ను ఔట్ చేసి మార్కో జాన్సెన్ అన్‌సంగ్ హీరోగా నిలిచాడు.

## ప్లేయర్ ఆఫ్ ద మంత్ శ్రేయాస్ అయ్యర్

**బలగం టీవీ, హైదరాబాద్**




మార్చి 2025 ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డును ఇండియన్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌కు దక్కింది. మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో అతను మిడిల్ ఆర్డర్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ, రచిన్ రవీంద్ర నుంచి పోటీ వచ్చినా.. ఆ రేసులో అయ్యర్ టాప్‌లో నిలిచాడు. ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్అత్యధికంగా 243 రన్స్ స్కోర్ చేశాడు. అయితే వరుసగా ఇద్దరు ఇండియన్లకు ఈ అవార్డు దక్కింది. ఫిబ్రవరి నెలలో శుభమన్ గిల్ .. ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు వశం చేసుకున్నాడు.

మార్చి నెలకు ఐసీసీ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని అయ్యర్ తెలిపాడు. ఈ గౌరవం తనకు ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన నెలలోనే ఆ అవార్డు రావడంతో నిజంగా ఆ జ్ఞాపకాలను మరిచిపోలేమన్నారు. మార్చిలో ఆడిన మూడు వన్డేల్లో అతను 57 సగటుతో 172 రన్స్ చేశాడు. గ్రూపు ఏ మ్యాచ్‌లో కివీస్‌పై 79 రన్స్, ఆ తర్వాత సెమీస్‌లో ఆస్ట్రేలియాపై 45 రన్స్, ఇక ఫైనల్లో 48 రన్స్ చేశాడు.



## హైదరాబాద్‌కు చేరుకున్న మహేశ్‌బాబు

**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో భారీ బడ్జెట్ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే టాలీవుడ్‌లో ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో కొనసాగుతోంది. తాజాగా ఓ కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసిన తర్వాత యూనిట్ స్వల్ప విరామం తీసుకుంది. ఈ బ్రేక్ టైమ్‌లో మహేష్ బాబు తన కుటుంబంతో కలిసి ఇటలీకి వెళ్లాడు. రోమ్ నగరంలో హాలిడే ఎంజాయ్ చేసిన ఆయన, ఈరోజు ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లో అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అంతేకాదు, డైరెక్టర్ రాజమౌళి కూడా కుటుంబ సమేతంగా జపాన్ టూర్‌కి వెళ్లారు.




## టాప్ 1 ప్లేస్‌లో రమ రామ సాంగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర. బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది

## 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మేకర్స్‌కు లీగల్ నోటీసులు పంపిన ఇళయారాజ

**బలగం టీవీ, హైదరాబాద్**



తమిళ హీరో అజిత్ నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' . దర్శకుడు అధిక్ రవిచంద్రన్ (%ూాంసష్ట్రఱఅ తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలైన విషయం తెలిసిందే. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ రూపొందిన ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా తాజాగా షాక్ ఇచ్చారు. మేకర్స్‌కు లీగల్ నోటీసులు పంపారు. ఈ సినిమాలో గతంలో తాను స్వరపరిచిన మూడు పాటలను అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని నోటీసుల్లో పేర్కొన్నారు. 'నాట్టుపుర పట్టు' అనే తమిళ చిత్రం నుంచి 'ఓథ రుబాయుమ్ తేరెన్', 'సకలకళా వల్లవన్' అనే తమిళ చిత్రం నుంచి 'ఇలమై ఇథో ఇథో' పాట, 'విక్రమ్' చిత్రంలోని 'ఎన్ జోడి మంజ కురువి' పాటలను తన అనుమతి లేకుండా రీ క్రియేట్ చేసి అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో వాడారని తెలిపారు. అందుకుగానూ రూ.5 కోట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాదు సినిమాలో ఆ సాంగ్స్‌ను వెంటనే తొలగించి క్షమాపణలు చెప్పాలని కోరారు.




## ఆగస్టులో బంగ్లాదేశ్‌కు టీమిండియా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ అనంతరం భారత జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటించనున్నది ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ పర్యటనలో టీమిండియా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. రెండు వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఐపీఎల్ తర్వాత భారత్ జూన్‌లో ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ తర్వాతే భారత్ బంగ్లాదేశ్ పర్యటనకు బయల్దేరుతుంది.

**వన్డే సిరీస్ షెడ్యూల్..**

**తొలి వన్డే - ఆదివారం, ఆగస్టు 17, మిర్పూర్**

**రెండోవన్డే- బుధవారం,ఆగస్టు 20, మిర్పూర్**

**మూడోవన్డే-శనివారం,ఆగస్టు23, చట్టోగ్రామ్**

**టీ20 సిరీస్ షెడ్యూల్..**

**తొలి టీ20 - మంగళవారం, ఆగస్టు 26, చట్టోగ్రామ్‌ల**

**రెండో టీ20 - శుక్రవారం, ఆగస్టు 29, మిర్పూర్‌ల**

**మూడు టీ20 -ఆదివారం, ఆగస్టు 31, మిర్పూర్**



## గాయంతో ఎస్ఆర్‌హెచ్ బౌలర్ జాంపా దూరం

- **అతని స్థానంలో సమరన్ రవిచంద్రన్ ఎంపిక**

**బలగం టీవీ, హైదరాబాద్**

సన్‌రైజర్స్ హైదారబాద్ స్టార్ స్పిన్నర్ ఆడం జంపా గాయపడ్డాడు. దాంతో, అతడు ఐపీఎల్ 18వ ఎడిషన్ నుంచి నిష్క్రమించాడు. భుజం గాయంతో బాధ పడుతున్న జంపా విశ్రాంతి తీసుకోనున్నాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతని స్థానంలో సమరన్ రవిచంద్రన్‌ను ఎంపిక చేసిందిసమరన్ రవిచంద్రన్, డొమెస్టిక్ క్రికెట్‌లో కర్ణాటక తరఫున ఆడుతున్నాడు.

"కర్ణాటక తరఫున డొమెస్టిక్ క్రికెట్ ఆడే ఎడమచేతి బ్యాట్స్‌మెన్ సమరన్, రూ. 30 లక్షలకి ఎస్ఆర్‌హెచ్ జట్టులో చేరాడు." ఈ మేరకు జట్టు తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపింది: "స్వాగతం సమరన్! గాయంతో తప్పుకున్న ఆడమ్ జాంపా స్థానంలో అతను మా జట్టులో చేరాడు." అని తెలిపింది.

సమరన్ రవిచంద్రన్ గణాంకాలు:
ఫస్ట్ క్లాస్: 7 మ్యాచ్‌లు, సగటు 64.50, పంజాబ్‌పై డబుల్ సెంచరీ
లిస్ట్ ఏ 10 మ్యాచ్‌లు, 433 పరుగులు, సగటు 72.16, రెండు శతకాలు
టీ20: 6 మ్యాచ్‌లు, 170 పరుగులు, స్ట్రైక్ రేట్ 170

## సల్మాన్‌ను బెదిరించిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు సల్మాన్ ఖాన్‌కు సోమవారం మరోసారి ఆగంతకుల నుంచి తీవ్ర బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. "సల్మాన్... నిన్ను ఇంట్లోనే చంపుతాం, లేదంటే నీ కారుని బాంబు పెట్టి పేల్చేస్తాం" అని ముంబయిలోని వర్లీ రవాణా శాఖ వాట్సాప్ నంబర్‌కు ఓ సందేశం వచ్చింది. దాంతో వర్లీ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు, బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆ మేసేజ్ పంపిన వ్యక్తిని పోలీసులు తాజాగా గుర్తించారు. గుజరాత్ రాష్ట్రం వడోదరకు చెందిన 26 ఏళ్ల వ్యక్తే బెదిరిస్తూ సందేశం పంపినట్లు చెప్పారు. అయితే, అతడు మానసిక రోగి అని, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, గతంలో సల్మాన్‌ను చంపుతామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలుమార్లు బెదిరించిన విషయం తెలిసిందే.